సాక్షి ప్రకాశం

ఆదివారం । 9 । మార్చి । 2025



జగనన్న పాలనలో మహిళలకు సమాన అవకాశాలు

వైఎస్ జగన్ పాలనలో మహిళలకు సంక్షేమ పథకాలు అందాయని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. - 8లో..




దొడ్డుబియ్యం తినలేకపోతున్నాం..

రోజూ దొడ్డుబియ్యం అన్నం పెడుతున్నారు. అది తినలేకపోతున్నామని కనిగిరి బీసీ గురుకుల విద్యార్థులు మంత్రులు సవిత, ఆనం ఎదుట మొరపెట్టుకున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
32/18

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.



ఆత్మస్తుతి..పరనింద

అన్నీ తానే చేశానంటూ అదే ఊకదంపుడు ఉపన్యాసం.. అవే కప్పదాటు హామీలు..మహిళా దినోత్సవం సందర్భంగా మార్కాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగం ఆద్యంతం ఆత్మస్తుతి..పరనింద అన్నట్లు సాగింది. ముఖాముఖిలో మహిళలు, విద్యార్థినులు అడిగిన ఏ ఒక్క సమస్యకూ స్పష్టమైన హామీ ఇవ్వకుండా తనదైన శైలిలో మాటలు దాటేశారు. ఈమాత్రం దానికి ఈ మీటింగులెందుకంటూ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు.



సీఎం మాట్లాడుతున్న సమయంలో ఖాళీ అయిన కుర్చీలు

- మహిళా దినోత్సవ సభలో ఆద్యంతం తన గొప్పలు చెప్పుకున్న చంద్రబాబు
- స్పష్టత లేని హామీలపై ప్రజల అసంతృప్తి
- వెలుగొండ ప్రాజెక్టు, మార్కాపురం జిల్లా చేయడంపై పాత పాట
- మెడికల్ కాలేజీ ఊసే లేదు
- సీఎం ప్రసంగం మధ్యలోనే వెనుతిరిగిన మహిళలు

మార్కాపురం టౌన్:

మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మార్కాపురం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికలపై స్పష్టత లేని హామీలు ఇవ్వడంపై అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో తనను గెలిపిస్తే మార్కాపురం జిల్లా చేసి వస్తానని చెప్పిన హామీని మర్చిపోయి మహిళా దినోత్సవం రోజున హాజరై ఒక విద్యార్థిని అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ మార్కాపురం జిల్లా చేస్తానని, వెలుగొండను పూర్తిచేస్తానని మరోసారి కాల పరిమితిలేని హామీ ఇచ్చారు. మార్కాపురం పట్టణంలో సాధనా డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఒక విద్యార్థిని మార్కాపురంలో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరగా ''నీకు ఓటు ఉందమ్మా... నీవు ఓటు ఎవరికి వేశావంటూ...'' ప్రశ్నించారు. బిక్క మొహం వేసిన ఆ అమ్మాయి తనకు ఓటు లేదని చెప్పింది. మార్కాపురం జిల్లా చేస్తాననీ, అప్పుడే పీజీ సెంటరుతో పాటు అన్నీ సమస్యలు తీరుతాయని చెప్పారు. అయితే స్పష్టంగా ఎప్పటిలోగా చేస్తారో చెప్పకపోవడంతో ప్రజలు, మహిళలు నిరాశచెందారు. పెదారికట్లకు చెందిన సుజాత తాను ప్రకృతి వ్యవసాయం చేస్తున్నానని, సాగు నీరు, తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నానని వెలుగొండ నీళ్లు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు. దీంతో ఆయన మాట్లాడుతూ గతంలో తానే వెలుగొండకు శంకుస్థాపన చేశాననీ, పూర్తిచేసి కృష్ణానీటితోపాటు గోదావరినీటిని కూడా ఈ ప్రాంతంలో పారిస్తానని చెప్పారు. ఎప్పుడు పూర్తిచేస్తారో కాలపరిమితి చెప్పకపోవడంతో ప్రజలు, మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక పశ్చిమ ప్రకాశం ప్రజలకు వరమైన మెడికల్ కాలేజీ గురించి ఎటువంటి ప్రకటన చేయలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఈ రెండు హామీలు ఇప్పట్లో నెరవేరేలా లేవంటూ సీఎం తీరుపై ప్రజలు మండిపడ్డారు. పాతికేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఐటీ రంగాన్ని తానే ప్రవేశపెట్టానని, తానే టెక్నాలజీని తీసుకొచ్చానన్నట్లుగా ఆయన చెప్పిన మాటలు విని జనం విస్తుపోయారు.

సీఎం ప్రసంగం మధ్యలోనే వెనుతిరిగిన మహిళలు:

సీఎం సుదీర్ఘ ప్రసంగంతోపాటు మార్కాపురం జిల్లా, వెలుగొండ ప్రాజెక్టు, మెడికల్ కాలేజీ నిర్మాణం తదితర అంశాలపై స్పష్టమైన ప్రకటన లేకపోవడంతో మహిళలు సీఎం ప్రసంగం మధ్యలోనే బయటకు వెళ్లిపోతుండటంతో పోలీసులు బలవంతంగా కూర్చోబెట్టారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి స్కూల్ బస్సులను పంపించి మహిళలను పిలిపించారు. సభ ప్రారంభమైన కొద్ది సేపటికే ప్రాంగణం నుంచి మహిళలు వెళ్లిపోవడంతో ఖాళీ కుర్చీలు కనిపించాయి. వాటిని భర్తీ చేసేందుకు అధికారులు నానా ఇబ్బంది పడ్డారు.

వీరికి లేదా మహిళా దినోత్సవం

ఒక వైపు మహిళా దినోత్సవం జరుగుతుండగా మరో వైపు మహిళా పారిశుధ్య కార్మికులు ఎండలో నిలబడి సేవలందిస్తున్నారు. తమకు ఇలాంటి దినోత్సవాలు ఏమీ పట్టవని, సేవలు చేయడమే తమ జీవితం గడిచిపోతోందని పలువురు మహిళా పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఎండలో విధులు నిర్వహిస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులు



వాహనాలను నిలిపేసిన పోలీసులు



మహిళలను తరలించేందుకు వచ్చిన స్కూల్ వాహనాలు

మీ ఎమ్మెల్యే పనితీరు ఆశించినంతగా లేదు !

- సమీక్షలో కందులపై చంద్రబాబు అసంతృప్తి



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు

సాక్షి ప్రతినిధి ఒంగోలు: మీ ఎమ్మెల్యే పనితీరు ఆశించినంతగా లేదు. పనితీరు మెరుగుపరుచుకోవాల్సిందే అంటూ మార్కాపురం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కందులనారాయణరెడ్డిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం మార్కాపురంలో ఏర్పాటుచేసిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో 175 నియోజకవర్గాలు ఉండగా మార్కాపురం 104వ స్థానంలో ఉందని అన్నారు. 50,953 మంది సభ్యత్వ నమోదు చేర్పించారన్నారు. ఈ లెక్క ప్రకారం 4.17 శాతం మందిలో ఒకరిని మాత్రమే సభ్యులుగా చేర్చారని, 3 శాతాన్ని లక్ష్యంగా పెట్టుకుని సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. మీరు నాకు అరచేతిలో స్వర్గం చూపించినా మీ చిట్టా నా దగ్గర ఉంది అన్నారు. చాలా మంది సభ్యత్వ నమోదులో ముందుకు వెళ్లినా మీరు మాత్రం అక్కడే ఉన్నారన్నారు. ప్రభుత్వం 8 పథకాలను ప్రారంభించగా మీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి 3 కార్యక్రమాల్లో మాత్రమే పాల్గొన్నారని, మీ ఎమ్మెల్యే పాస్ కాలేదని చెప్పారు. 37 శాతం మార్కులు మాత్రమే వచ్చాయన్నారు. ఇలా అయితే ఎలా పాసైనట్లు అన్నారు. నేను నిర్మొహమాటంగా చెబుతున్నా ఆయన నన్ను ఏమార్చినా చిత్రగుప్తుని చిట్టాలా నావద్ద అందరి లెక్కలుంటాయని అన్నారు. అవసరమైనప్పుడు చిట్టా మొత్తం బయటకు తీస్తానని, నేనెప్పటికప్పుడు చెక్ చేసుకుంటానని చెప్పారు. ఈ సమయంలో ఎమ్మెల్యే కందుల లేచి తాను కాలు ఆపరేషన్ చేయించుకున్నందు వలన పాల్గొనలేకపోయానని చెప్పారు. పర్ఫెక్షన్‌లో మీ నంబరు మాత్రం ఇప్పుడేమీ చెప్పనన్నారు. పార్టీ కార్యక్రమాల్లో కచ్చితంగా పాల్గొనాలని, సభ్యత్వ నమోదు మెరుగుపర్చుకోవాలంటూ కందులకు చెప్పారు. సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నూకసాని బాలాజీ, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల నియామకం

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లాకు చెందిన నాయకులను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ లలో వివిధ హోదాల్లో నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీగా భూమిరెడ్డి రమణమ్మ, రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీగా మదాల వెంకట సుబ్బారావు, రాష్ట్ర వాణిజ్య విభాగం సెక్రటరీగా సిరిగిరి గోపాల్‌రెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం జాయింట్ సెక్రటరీగా దోగిపర్తి రంజిత్‌కుమార్, రాష్ట్ర ఇంటిలెక్చువల్స్ ఫోరం జనరల్ సెక్రటరీలుగా డాక్టరు చెప్పల్లి కనకదుర్గ, డాక్టరు బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి లను నియమించారు. రాష్ట్ర ఇంటిలెక్చువల్స్ ఫోరం సెక్రటరీలుగా కంచర్ల సుధాకరబాబు, మేడ వెంకట బదరీనారాయణ లను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది.

సీనియారిటీ జాబితాలో పూర్తి సర్వీసు ఇవ్వాలి

- ఏపీ టీచర్స్ గిల్డ్ డిమాండ్

ఒంగోలు సిటీ: ప్రభుత్వంలో విలీనమైన 3250 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులకు సీనియారిటీ జాబితాలో పూర్తి సర్వీసు ఇవ్వాలని ఏపీ టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్. ప్రభాకరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 50 ప్రకారం ఎయిడెడ్ పాఠశాల నుంచి ఉపాధ్యాయులను ప్రభుత్వంలో విలీనం చేశారని తెలిపారు. 2022 మార్చి 22వ తేదీ నుంచి నేటి వరకు దశల వారీగా ప్రభుత్వంలో విలీనమైన ఉపాధ్యాయులకు ప్రస్తుత పదోన్నతులు, బదిలీల్లో సీనియార్టీ జాబితా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జిల్లా విద్యాశాఖ అధికారులు తయారు చేశారన్నారు. ఈ జాబితాలో ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పూర్తి సర్వీస్ కేటాయించాలని కోరారు.

సీఎం పర్యటన గంట ఆలస్యం

పొదిలి రూరల్: సీఎం చంద్రబాబు జిల్లా పర్యటన గంట ఆలస్యంగా జరిగింది. మార్కాపురంలో మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం తలపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన అధికారులు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం జరగలేదు. అధికారులు తెలిపిన షెడ్యూల్ ప్రకారం ఉదయం 10 గంటలకు ఉండవల్లి నుంచి బయలుదేరి 10.45 గంటల తర్లుపాడు రోడ్డులోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారని తెలిపారు. అయితే అధికారులు తెలిపిన సమయం కన్నా గంట ఆలస్యం అంటే 11.40 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ అధికారులు, ప్రజాప్రతినిధులు బొకేలిచ్చి స్వాగతం పలికే సరికి 12 గంటలు అయింది. 12 గంటల తరువాత మహిళా దినోత్సవం కార్యక్రమానికి వెళ్లారు. అయితే ఉదయం నుంచి సీఎం కోసం ఎదురు చూసిన కార్యకర్తలు నిరుత్సాహ పడ్డారు. హెలీప్యాడ్ వద్దకు వచ్చిన కొద్దిపాటి కార్యకర్తలు అనుకున్న సమయానికి సీఎం రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండుటెండలో కనీసం తాగడానికి నీరు, నిల్చుడానికి నీడ లేక నిరసించిపోయారు. అంతేగాక వాహనాల్లో ప్రయాణం చేసే ప్రయాణికులను పోలీసులు ఎక్కడికక్కడే నిలిపి వేయడంతో ఎండలోనే ఉండిపోయారు. హెలీప్యాడ్ వద్ద కొంత మంది మందుబాబులు చంద్రబాబును చూసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో సీఎం పర్యటనలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, గుంటూరు అడిషనల్ ఎస్పీ సుప్రజ, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు, మార్కాపురం, దర్శి, కనిగిరి డీఎస్పీలు ఆర్ శ్రీనివాసరావు, నాగరాజు, లక్ష్మీనారాయణ, సాయి ఈశ్వర యశ్వంత్ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ హయాంలో మహిళలకు స్వర్ణయుగం

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- మహిళలకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలం
- పాల్గొన్న మాజీ మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను గజమాలతో సన్మానిస్తున్న మాజీ మంత్రులు మేరుగు, ఆదిమూలపు

ఒంగోలు సిటీ: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన రాష్ట్రంలోని మహిళలకు ఒక స్వర్ణయుగంగా మిగిలిపోతుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. ఒంగోలులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో మహిళల సంక్షేమం కొనసాగిందన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, వైఎస్సార్ చేయూత, తదితర పథకాల పేరుతో మహిళల బ్యాంకు ఖాతాలో నేరుగా నగదు జమ చేశారని చెప్పారు. ప్రభుత్వ పథకాలన్నింటిలో మహిళలకు భాగస్వామ్యం కల్పించారని, పరిపాలనలో పెద్దపీట వేశారన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారి ఓ దళిత మహిళలకు హోంశాఖ మంత్రిగా నియమించిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. మహిళల రక్షణ కోసం దిశ యాప్‌ను తీసుకురావడమే కాకుండా దిశ చట్టాన్ని అమలు చేశారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ముఖ్యంగా మహిళలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం మహిళలను విస్మరిస్తోందని, అనేక రకాల వాగ్దానాలు చేసి అమలు చేయకుండా మహిళలను నిట్టనిలువునా మోసం చేశారని విమర్శించారు. జగనన్న పాలనలో కడుపులోని బిడ్డ నుంచి వందేళ్ల వృద్ధుల వరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. ఆనాడు కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం మోసపూరిత విధానాలను మహిళలు నిలదీయాలన్నారు.

మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ రాజకీయంగా, పరిపాలన పరంగా మహిళలకు సమాన అవకాశాలు కల్పించడానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాటుపడ్డారని తెలిపారు. వైఎస్సార్ హయాంలో ఏకంగా ఆరుగురు మహిళలకు మంత్రివర్గంలో స్థానం కల్పించారన్నారు. మహిళలు ముందడుగు వేస్తేనే సమాజంలో సానుకూల మార్పు వస్తుందని భావించిన మహిళా పక్షపాతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం మ్యానిఫెస్టోను అటకెక్కించి చేసిన హామీల్లో ఒక్కదానిని కూడా సక్రమంగా అమలు చేయకుండా ఒట్టి చేతులు చూపుతున్నారని విమర్శించారు. కళ్యాణలక్ష్మి, విద్యాలక్ష్మీ పథకాలకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. స్త్రీనిధి నిధులను పక్కదారి పట్టిస్తూ దుర్వినియోగం చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం కుట్రలను మహిళలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. జగనన్న 2.0 లో కార్యకర్తలకే పెద్దపీట వేయనున్నారని చెప్పారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై కార్యకర్తలు పోరాడాలన్నారు.

ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు మాట్లాడుతూ జగనన్న పాలనలో మహిళల సాధికారిత కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని చెప్పారు. మహిళలు చైతన్యవంతులు కావాలని ప్రభుత్వ మోసపూరిత విధానాలను ప్రశ్నించాలని సూచించారు. తొలుత పార్టీ కార్యాలయంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాయకుడు నూకతోటి శరత్‌కుమార్ ఆలపించిన జయహో మహిళ పాట ఆకట్టుకుంది. జిల్లాలోని మహిళా నాయకులు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను గజమాలతో ఘనంగా సన్మానించి అంతర్జాతీయ మహిళా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, ఒంగోలు జెడ్పీటీసీ చుండూరు కోమలేశ్వరి, హనుమంతునిపాడు ఎంపీపీ గాయం సావిత్రి, కొండెపి జెడ్పీటీసీ మారెడ్డి అరుణకుమారి, రాష్ట్ర మహిళా కార్యదర్శి మేడికొండ జయంతి, మహిళా నాయకురాలు భూమిరెడ్డి రమణమ్మ, కనిగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి, కార్పొరేటర్ వెన్నపూస కుమారి, కోఆప్షన్ మెంబర్ షేక్ రషీదా, ఎస్టీ సెల్ అధ్యక్షురాలు పి.ప్రసన్న, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బడుగు ఇందిర, అంగన్‌వాడీ అధ్యక్షురాలు గోవిందమ్మ, మద్దిపాడు ఎంపీపీ అరుణ, తమ్మినేని సుజాతారెడ్డి, నియోజకవర్గ అంగన్‌వాడీ అధ్యక్షురాలు వడ్లమూడి వాణి, మేరికుమారి, సయ్యద్ అప్సర్, ఎస్.రమణమ్మ, జ్యోతి, మాధవి, బి.రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, మహిళలు

లోక్ అదాలత్‌లో 3327 కేసులు పరిష్కారం

ఒంగోలు: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లాలో శనివారం 3327 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎ.భారతి పేర్కొన్నారు. వీటిలో 159 సివిల్, 3155 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులతోపాటు మరో 13 ప్రీలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించారు. దీంతో మొత్తం 3327 కేసులు పరిష్కారం అయ్యాయి.

క్లుప్తంగా

కంభంలో వ్యక్తి అనుమానాస్పద మృతి



ప్లాట్లలో పడి ఉన్న మృతదేహం

కంభం: స్థానిక తర్లుపాడు రోడ్డులోని రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న ప్లాట్లలో సుమారు 50 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతుడిని కందులాపురం కాలనీకి చెందిన శ్రీనుగా గుర్తించారు. మృతుడు హోటళ్లలో పని చేసుకుంటూ ఖాళీ సమయంలో ప్లాస్టిక్ బాటిల్స్ సేకరించి విక్రయించుకుంటూ జీవనం సాగిస్తుంటాడని తెలిసింది. మృతుడు వడదెబ్బతో మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి వివాహం కాలేదు. అసలు అక్కడికి ఎందుకు వెళ్లాడు? మృతికి గల కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

పెట్రోల్ దాడిలో గాయపడిన మహిళ మృతి



చికిత్స పొందుతున్న నూర్జహాన్‌బీ(ఫైల్)

పెద్దదోర్నాల: స్థలం విషయమై దాయాదుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో తీవ్రంగా గాయపడిన మహిళ ఆరోగ్య పరిస్థితి విషమించి ఆస్పత్రిలో మృతి చెందింది. పెద్దదోర్నాల మండలం బొమ్మలాపురం పంచాయతీలోని తూర్పుపల్లెలో శుక్రవారం వేకువజామున చలిమంట వద్ద ఉన్న నాగూరువలి, నూర్జహాన్‌బీపై దాయాదులైన దూదేకుల ఖాశింవలి, అతని కుటుంబ సభ్యులు పెట్రోల్ క్యాన్లతో దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన నాగూర్‌వలి మృతి చెందగా, నూర్జహాన్‌బీ శుక్రవారం అర్ధరాత్రి ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించింది. ప్రత్యర్థులు జరిపిన పెట్రోల్ దాడిలో 80 శాతం కాలిన గాయాలైన నూర్జహాన్‌ను చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ప్రథమ చికిత్స చేస్తున్న క్రమంలో ఆమె పరిస్థితి విషమించి మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. సెంటున్నర స్థలం విషయమై దాయాదుల పిల్లల మధ్య జరిగిన గొడవల్లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

క్రికెట్ బుకీపై కేసు నమోదు

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలో క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్న తేజపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. ఈనెల 20వ తేదీన క్రికెట్ బెట్టింగుకు పాల్పడి డబ్బు పోగొట్టుకుని ఇంటి నుంచి వెళ్లిపోయిన బత్తిన అశోక్ వ్యవహారంలో ప్రధాన పాత్ర పోషించిన నేపథ్యంలో తేజపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. నిందితుడికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించినట్లు ఎస్సై శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జగనన్న పాలనలో మహిళలకు సమాన అవకాశాలు

- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను సత్కరిస్తున్న బీవీఎస్ఆర్ కాలేజీ అధ్యాపకులు, సిబ్బంది

చీమకుర్తి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా కాలంలో సంక్షేమ పథకాలు, పార్టీ పదవుల్లో 50 శాతం మహిళలకే కట్టబెట్టారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం చీమకుర్తిలోని బీవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో కాలేజీ మహిళా లెక్చరర్లు, సిబ్బంది ఆధ్వర్యంలో బూచేపల్లి వెంకాయమ్మను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మహిళల రక్షణకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశ యాప్‌ను తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని కాలేజీ విద్యార్థినులతో కలిసి ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి

ఒంగోలు: మహిళలు అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా న్యాయస్థానం ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయసేవాధికార సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. సెలవులతో సంబంధం లేకుండా నిరంతరం పనిచేసే శక్తి మహిళా శక్తి అని అభివర్ణించారు. పురుషులతో సమానంగా శ్రమిస్తున్నప్పటికీ సామాజికంగా చిన్నచూపు చూడటం తగదన్నారు. మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తూనే ఆర్థికంగా స్వయం ప్రతిపత్తి సాధించడం ద్వారా శక్తివంతంగా మరింత ముందుకు వెళ్లవచ్చన్నారు. కార్యక్రమానికి హాజరైన మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ.. పని ప్రదేశాల్లో లైంగిక దోపిడీ జరిగినట్లయితే సంబంధిత కమిటీకి తమ సమస్యను తెలియజేసి తగిన విధంగా పరిష్కారం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు డి.అమ్మన్నరాజా, డి.రాములు, జి.దీన, కె.శైలజ, సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఎస్.హేమలత, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు పి.భానుసాయి, ఎస్.కోమలవల్లి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

దొడ్డు బియ్యం తినలేకపోతున్నాం

- మంత్రులు సవిత, ఆనం ఎదుట గురుకుల పాఠశాల ఆవేదన



బీసీ గురుకులంలో బాలికలతో మాట్లాడుతున్న మంత్రి సవిత

కనిగిరిరూరల్: 'రోజూ లావు బియ్యంతో అన్నం పెడుతున్నారు. అది తినలేకపోతున్నాం. మంచి నీళ్లకు చాలా ఇబ్బంది పడుతున్నాం. హాస్టల్ బిల్డింగ్ కూడా బాగోలేదు' అని కనిగిరి బీసీ గురుకులం విద్యార్థులు రాష్ట్ర మంత్రులు ఎస్.సవి, ఆనం రామనారయణరెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కనిగిరి వచ్చిన ఇద్దరు మంత్రులు.. ఇక్కడి మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. మెనూ, ఇతర వసతుల గురించి ఆరా తీస్తున్న సమయంలో విద్యార్థులు తమ అవస్థలను తెలియజేశారు. మెనూ అమలు తీరు, హాజరు, స్టాక్ రికార్డులను పరిశీలించిన అనంతరం మంత్రి సవిత విలేకర్లతో మాట్లాడుతూ.. వచ్చే ఏడాది నుంచి వసతి గృహాలకు బీపీటీ బియ్యాన్ని అందజేస్తామని చెప్పారు. హాస్టల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత తక్కువగా ఉందని, స్టాక్ రిజిస్టర్ నిర్వహణ సక్రమంగా లేదని గుర్తించి తగిన చర్యలకు ఆదేశాలిచ్చామన్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ.. వెలిగొండ ప్రాజెక్టును తప్పకుండా పూర్తి చేసి కనిగిరి, మార్కాపురం, దర్శి, పొదిలి తదితర ప్రాంతాలకు తాగు, సాగు నీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

బీజేపీ పాలనలో మహిళలపై దాడులు

- ప్రగతిశీల మహిళా సంఘాల విలీన సభలో జాతీయ కన్వీనర్ సంధ్య ఆగ్రహం



పీఓడబ్ల్యూ సంఘాల విలీన సభలో ప్రసంగిస్తున్న జాతీయ కన్వీనర్ సంధ్య

ఒంగోలు టౌన్: బీజేపీ ప్రభుత్వంలో మహిళలు, మహిళా హక్కులపై దాడులు పెరిగిపోయాయని ప్రగతిశీల మహిళా సంఘ జాతీయ కన్వీనర్ వి.సంధ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014 నుంచి మనువాదాన్ని ప్రోత్సహించే బీజేపీ ప్రభుత్వం రావడంతో పితృస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతమైందని, దళితులు, మైనారిటీలపై దాడులు ఎక్కువయ్యాయని అన్నారు. నగరంలోని ఎన్జీఓ హోంలో శనివారం నిర్వహించిన ప్రగతిశీల మహిళా సంఘాల విలీనసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలోనే కాకుండా భారతదేశంలో కూడా నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని చెప్పారు. అయినప్పటికీ పురుషుల కంటే మహిళల హోదా తక్కువగా ఉందన్నారు. మహిళలు శక్తివంతంగా పోరాడుతున్నప్పటికీ వారి మీద జరుగుతున్న లైంగికదాడులు ఆగలేదన్నారు. హత్రాస్‌లో దళిత బాలిక, మణిపూర్‌లో గిరిజన మహిళ, బెంగాల్లో పీజీ డాక్టర్‌పై జరిగిన ఘటనలే దీనికి నిదర్శనమన్నారు. దేశంలో ప్రభుత్వ లెక్కల ప్రకారమే లక్షల మంది ఆకలి చావులకు బలవుతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం మనిషికి ఐదు కిలోల లెక్కన బియ్యం సరఫరా చేసి ఇంట్లో ఆఖరి ముద్ద తినే మహిళలను మరింతగా ఆకలికి గురిచేస్తోందన్నారు. కొత్తగా వచ్చిన లేబర్ కోడ్ చట్టాలు మహిళా కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, వ్యవసాయ కూలీల వేతనాలు అమలు జరగడం లేదని అన్నారు. సభలో పీఓడబ్ల్యూ జాతీయ కో ఆర్డినేటర్ ఝాన్సీ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమాసుందరి మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నా, సమాన హోదా కావాలన్నా, దోపిడీ రహిత సమాజం నిర్మాణం జరగాలన్నా మహిళలు మరింత క్రియాశీలకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. సభలో విష్ణు, గంగా భవాని, బి.పద్మ, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అరుణోదయ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మహిళల అభ్యున్నతికి కృషి చేయాలి



మహిళలను సన్మానించి బహుమతులు అందజేస్తున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి



జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంలను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

ఒంగోలు సిటీ: మహిళల అభ్యున్నతికి నిరంతరం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఒంగోలులోని సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. మహిళలకు పలు పోటీలు నిర్వహించారు. 50 మంది మహిళా ఉద్యోగులను సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారన్నారు. ఇదేవిధంగా రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, కోశాధికారి రంగారెడ్డి, జిల్లా సహాధ్యక్షుడు మసూద్ అలీ, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎస్వీ రమణారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, భూపాల్, ఒంగోలు పట్టణ అధ్యక్షుడు మోటార్ శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఒంగోలు తాలూకా అధ్యక్షుడు సురేష్, యేసురత్నం చంద్రశేఖర్, గోపికృష్ణ, డాక్టర్ రజిత మానస, వనజ, గౌరీ, సుమతి, దర్శి అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కనిగిరి అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యమే సమాజాభివృద్ధికి గీటురాయి...

- యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు

మహిళా చైతన్యమే సమాజాభివృద్ధికి గీటురాయి అని, దేశంలోని మహిళలందరూ విద్య సముపార్జించిన రోజే మహిళా సాధికారతకు మార్గం సుగుమం అవుతుందని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఒంగోలులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎం.సంధ్యారాణి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పని ప్రదేశాలలో విశ్రాంతి సౌకర్యాలు కల్పించాలన్నారు. పాఠశాలలో బాలికలకు ప్రత్యేక విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగ అభివృద్ధిలో, ఉపాధ్యాయ హక్కులు సాధించడంలో మహిళా ఉపాధ్యాయులు ముందు వరుసలో ఉండాలన్నారు. నాయకత్వ స్థానాల్లోకి రావాలని కోరారు.

అనంతరం ఒంగోలు ఎంఈఓ సరస్వతి, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పార్వతీశాంతి, ఎం.శ్రీదేవి, నాగకళ్యాణి, సంపూర్ణమ్మలను యూటీఎఫ్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి, జిల్లా కోశాధికారి ఎన్.చిన్నస్వామి, జిల్లా కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, ఒంగోలు నగర అధ్యక్షురాలు డి.జ్యోత్స్నదేవి, ఒంగోలు ప్రాంతీయ మండలాల నాయకులు కాట్రగడ్డ నర్సింహారావు, ఆంజనేయులు, ఎస్వీ కొండారెడ్డి, హేమలత, ఉషారాణి, ఝాన్సీలక్ష్మీబాయి, పద్మశ్రీ, ధనలక్ష్మి, ఎస్.శారదమ్మ, తదితరులు పాల్గొన్నారు.



రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, స్వర్ణలతారెడ్డి దంపతులు ఒంగోలులో టీ సుబ్బారెడ్డి, డాక్టర్ అరుణారెడ్డిల కుమార్తె కీర్తి, రాజశేఖర్‌రెడ్డిల నిశ్చితార్థ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరులను ఆశీర్వదించారు.

భూ సమస్య చెప్పుకొందామంటే అడ్డుకున్నారు

సీఎంను కలవనీయలేదని వృద్ధురాలి ఆవేదన



వృద్ధురాలు మాణిక్యమ్మ

మార్కాపురం: తన భూమిని అన్యాయంగా వీఆర్‌ఓ ఆన్‌లైన్ చేసుకున్నాడని సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వృద్ధ మహిళకు చేదు అనుభవం ఎదురైంది. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఎంతో దూరం నుంచి వస్తే ముఖ్యమంత్రి వద్దకు వెళ్లకుండా అధికారులు అడ్డుకున్నారని మీడియా ఎదుట గోడు వెళ్లబోసుకుంది. కొనకనమిట్ల మండలం నాగంపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు మాణిక్యమ్మ శనివారం మార్కాపురం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబును కలిసేందుకు వచ్చింది. తన పొలాన్ని గ్రామ వీఆర్‌ఓ అన్యాయంగా ఆన్‌లైన్ చేసుకోవడంపై తహసీల్దార్, ఆర్డీఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో తనకు జరిగిన అన్యాయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు అర్జీ చేతపట్టుకుని ఎండను సైతం లెక్క చేయకుండా మార్కాపురం చేరుకుంది. ఇక్కడి తర్లుపాడు రోడ్డులో మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం వద్ద సీఎంను కలిసేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఆర్డీఓ తాను కచ్చితంగా సమస్యను పరిష్కరిస్తానని చెప్పడంతో ఉసూరుమంటూ వెనుదిరిగింది.

టిడ్కో ఇళ్లకు నిధులివ్వకుండా విమర్శలు సిగ్గుచేటు

- సీపీఎం నేతల విమర్శ



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం బృందం

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో 9 నెలల క్రితం అధికారం చేపట్టిన తెలుగుదేశం పార్టీ టిడ్కో ఇళ్లను పూర్తి చేయకుండా కేవలం విమర్శలతో కాలయాపన చేస్తోందని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మండిపడ్డారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సీపీఎం నాయకులు శనివారం నగరంలోని చింతల, కొప్పోలు టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. టిడ్కో గృహాలను పూర్తి చేయకుండా రాజకీయ విమర్శలకు పూనుకోవడం సిగ్గుచేటన్నారు. గత ఐదేళ్లుగా టిడ్కో గృహాల గురించి నోరు విప్పకుండా, రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించకుండా కేవలం విమర్శలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని హితవుపలికారు. సొంతింటి కల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న లబ్ధిదారులను మభ్య పెట్టడం మానుకుని ఇప్పటికైనా టిడ్కో ఇళ్లను పూర్తి చేసేందుకు అవసరమైన కార్యచరణ రూపొందించుకోవాలని చెప్పారు. కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే టిడ్కో ఇళ్లను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కొప్పోలు, చింతల వద్ద గృహ సముదాయాలు నివాసయోగ్యంగా లేవని తెలిపారు. వరద నీరు, చిల్లకంపతో నిండిపోయి ఉందన్నారు. ఇక్కడ గుంటలు పూడ్చి , చదును చేసి మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. టిడ్కో గృహసముదాయాల వద్ద ఎలాంటి రక్షణ లేదని, దొంగల బెడద ఎక్కువగా ఉందని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో తంబి శ్రీనివాసరావు, పి.కల్పన, బి.రఘురాం, సయ్యద్ హుసేన్, తంగిరాల మహేష్, దారా వెంకటేశ్వర్లు, దామా శ్రీనివాసరావు, సీహెచ్ వినోద్, తిరుపతిరావు, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జూడో జిల్లా స్థాయి పోటీలు

ఒంగోలు: స్థానిక భాగ్యనగర్ రెండో లైనులో ఉన్న వాకర్స్ క్లబ్‌లో ఆదివారం ఉదయం 10.30 గంటలకు జూడో జిల్లాస్థాయి జూనియర్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా అమెచ్యూర్ జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు 15 నుంచి 21 సంవత్సరాల్లోపు వారు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వారి ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల జాబితా, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రావాలన్నారు. పురుషులు, మహిళలకు వివిధ వెయిట్ కేటగిరీలలో పోటీలు ఉంటాయని, విజేతలు ఈ నెల 15 నుంచి 16వ తేదీ వరకు విజయవాడ ఐజీఎంసీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందని వివరించారు. పూర్తి వివరాలకు 9398817676, 9948877412 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కంభంలో చైన్ స్నాచింగ్

కంభం: పెళ్లి ఊరేగింపులో ఉన్న ఓ మహిళ మెడలో బంగారు సరుడును గుర్తుతెలియని దుండగులు లాక్కుని వెళ్లిపోయిన సంఘటన శుక్రవారం రాత్రి పట్టణంలోని చౌక్‌సెంటర్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. రాచర్ల మండలం చోళ్లవీడు గ్రామానికి చెందిన ఆకుల సుహాసిని అనే మహిళ శుక్రవారం కంభం పట్టణంలోని రామాలయంలో బంధువుల వివాహానికి హాజరైంది. రాత్రి పది గంటల తర్వాత చౌక్ సెంటర్ నుంచి రామాలయం వరకు పెళ్లి ఊరేగింపు జరుగుతుండగా ఎదురుగా ద్విచక్ర వాహనంపై ముఖానికి కర్చీఫ్ కట్టుకొని వచ్చిన వ్యక్తి సుహాసిని మెడలో ఉన్న రెండు తులాల బంగారు సరుడును లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.